జ్వాల **దశ**
నిజం.. నిర్భయంగా..

WWW.
DASHANEWS
.COM
మంగళవారం
14 04 2026
సంపుటి 1 సంచిక 141
పేజీలు : 04
PRGI No : TGTEL/25/A4195



# విలేకరులు కావలెను

జ్వాల దశ నిజం.. నిర్భయంగా..

నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న జ్వాల దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి ఆసక్తి గల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ | ఆర్.సీ. ఇన్చార్జులు | మండల రిపోర్టర్లు | క్రైమ్ రిపోర్టర్లు

7337 54 6647 (వాట్సాప్)




## ఇంటర్‌ల్లో ఫెయిల్ అయ్యామని ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య

**దశ, హైద్రాబాద్:** తెలంగాణలో నిన్న విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తీర్ణులు కాలేదని ఆవేదనతో రాష్ట్ర వ్యాప్తంగా ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వారసిగూడలో కళ్యాణి(16), నాచారంలో లక్ష్య(16), మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మంగళపర్తి గ్రామంలో సాయిరాం(16), ఉట్నూర్ గ్రామంలో సౌజన్య(17), భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామంలో శ్రావణి(17), సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం చందుపట్ల గ్రామంలో సౌజన్య(17), రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ గ్రామంలో అభియాదవ్ అనే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు.




## మలుపులు తిరుగుతున్న మంగ్లీ కేసు

### పాటే నా ప్రాణం.. నన్ను రోడ్డుకు లాగకండి: మంగ్లీ

**దశ, హైదరాబాద్:** సింగర్ మంగ్లీపై ఫిర్యాదు చేసేందుకు లాయర్ సుబ్బారావు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా హైడ్రామా చోటుచేసుకుంది. ఆల్కహాల్ తాగి వచ్చాడని అనుమానంతో సుబ్బారావుకు పంజాగుట్ట సీఐ బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయించారు. రీడింగ్ 27 పాయింట్లు రాగా, మోతాదులోపు ఆల్కహాల్ తీసుకున్నట్టు నిర్ధారణ అయింది. అయితే తాను రాత్రి మద్యం సేవిస్తే

..మిగతా 4వ పేజీలో →




## నేడు సీబీఎస్సీ పదో తరగతి పరీక్ష ఫలితాలు..

దశ, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్సీ) పదో తరగతి పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఈరోజు సాయంత్రంలోపు వెలువడనుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 17 నుంచి మార్చి 11 వరకు సీబీఎస్సీ పదో తరగతి పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు దేశవ్యాప్తంగా సుమారు 25 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరంతా ఫలితాల కోసం నిరీక్షిస్తున్నారు. ఫలితాలు విడుదలైన తర్వాత విద్యార్థులు అధికారిక

..మిగతా 4వ పేజీలో →


### డీ లిమిటేషన్ తో




# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

## సీఎం రేవంత్ రెడ్డి





**దశ, హైదరాబాద్:** మహిళా రిజర్వేషన్ బిల్లు కు ప్రతి ఒక్కరూ మద్దతు ఇస్తారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. లోకసభ సీట్ల పెంపు విషయంలో భిన్న భిన్నాభిప్రాయాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశిస్తూ ఆయన సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. మహిళా రిజర్వేషన్లకు అందరూ మద్దతు ఇస్తా రని,కానీ దాని ముసుగు లో లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. కేవలం జనాభా ప్రాతిపదికన లోక్‌సభ సీట్లు పెంచాలని చూడటం దక్షిణాది రాష్ట్రాలకు మరియు చిన్న రాష్ట్రాలకు తీరని అన్యాయం చేస్తుందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఇది భవి ష్యత్తు లో దేశ సమాఖ్య స్ఫూర్తిని బలహీనపరుస్తుందని హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్లు మరియు లోక్‌సభ సీట్ల పెంపు అనేవి పూర్తిగా భిన్నమైన అంశాలని దేశ ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. అసెంబ్లీ స్థానాల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేస్తే దేశం మొత్తం హర్షిస్తుందని ఆయన సూచించారు.





# డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా తెలంగాణ

### రాష్ట్రవ్యాప్తంగా 35 అడిక్షన్ సెంటర్స్

### బాధితులకు 6 వారాల పాటు పునరావాసం

### అత్యాధునిక కిట్‌ల ద్వారా 12 రకాల డ్రగ్స్ పరీక్షలు

### కేంద్రాల్లో మల్టీ-డ్రగ్ టెస్ట్ కిట్‌ల సరఫరా




**దశ, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా 35 అడిక్షన్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీ కేంద్రాలను ప్రారంభించింది. గాంధీ ఆసుపత్రిలో ప్రత్యేక ఎస్ఐసీయూ, కౌన్సెలింగ్ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. TGANB అందించే అత్యాధునిక కిట్‌ల ద్వారా 12 రకాల డ్రగ్స్‌ను నిమిషాల్లోనే గుర్తిస్తున్నారు. బాధితులకు 6 వారాల పాటు పునరావాసం కల్పిస్తూ.. చట్టపరమైన నిబంధనల ప్రకారం చికిత్స అందించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే నార్కోటిక్ విభాగంతో పాటు ఈగల్ టీమ్స్ ఏర్పాటు చేసి మత్తుపై ఉత్తుపాదం మోపుతోంది. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్విహిస్తూ.. గంజాయి, కొకైన్ ఇతర డ్రగ్స్ ముఠాలను కట్టడి చేస్తున్నారు. ఇటీవల కాలంలో చాలా చోట్ల దాడులు నిర్వహించి పలువుర్ని అరెస్టు చేశారు. రాష్ట్రంలో మత్తు పదార్థాల వినియోగం ఒక సామాజిక విపత్తుగా మారుతున్న తరుణంలో.. తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాల వ్యసనం నుంచి ప్రజలను కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా 35 రిహాబిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు.. అన్ని జిల్లాల్లోనూ ఏకకాలంలో వీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సహకారంతో ఈ కేంద్రాల్లో మల్టీడ్రగ్ టెస్ట్ కిట్‌లను సరఫరా చేశారు. ఈ కిట్‌ల ద్వారా గంజాయి, ఓపియాయిడ్స్, కొకైన్, యాంఫెటమైన్స్ వంటి దాదాపు 12 రకాల

..మిగతా 4వ పేజీలో →

### ఫార్మా భూముల అవినీతిపై

# చర్చకు సవాల్

### ఫార్మాసిటీ భూములలో అవినీతి ఆరోపణలపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి, ఎంపీ చామలకి మంచిరెడ్డి కిషన్ రెడ్డి బహిరంగ సవాల్..

## మేడిపల్లి వేదికగా చర్చకు సిద్ధమా?




**దశ, రంగారెడ్డి ప్రతినిధి:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఫార్మాసిటీ భూముల వ్యవహారంలో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేస్తున్న ఎమ్మెల్యే మాల్‌రెడ్డి రంగారెడ్డికి, మాజీ ఎమ్మెల్యే మరియు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఈ శుక్రవారం ఉదయం 10:00 గంటలకు తాను మేడిపల్లి గ్రామానికి వస్తున్నానని, దమ్ముంటే మాల్‌రెడ్డి రంగారెడ్డి మరియు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశం గుర్తించేలా అభివృద్ధి చేసింది కేసీఆర్ అని, హైదరాబాద్‌ను మోడ్రన్ సిటీగా మార్చిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్, కేటీఆర్‌లను విమర్శించే స్థాయి మల్‌రెడ్డికి, చామలకి లేదని, నియోజకవర్గానికి ఎంపీగా చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎన్ని నిధులు తెచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాల్‌రెడ్డి రంగారెడ్డి కోట్లాది రూపాయల విలువైన భూములను కబ్జా చేసి, తన కుటుంబ సభ్యుల పేరుతో గుడి నిర్మిస్తున్నారని కిషన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. తన చేతుల్లో మూడుసార్లు ఓడిపోయిన మల్‌రెడ్డికి తనపై మాట్లాడే హక్కు లేదని, ప్రజలు కాంగ్రెస్ పాలనను ఛీకొడుతున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం సర్వనాశనం చేస్తోందని, మంత్రి పదవుల కోసం కాకుండా నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆయన హితవు పలికారు. త్వరలోనే మాల్‌రెడ్డి భూ కబ్జాల

..మిగతా 4వ పేజీలో →

### ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

# పరీక్షల షెడ్యూల్

## మే 13 నుంచి 21వ తేదీ వరకు




**దశ, హైదరాబాద్:** గత ఐదేళ్లలో గరిష్ట స్థాయిలో ఇంటర్‌లో ఉత్తీర్ణత నమోదు కావడం ఇదే తొలిసారి. ఇక ఇంటర్ పరీక్షలు తప్పిన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌ను కూడా ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య ఆదివారం సాయంత్రం విడుదల చేశారు. ఈ పరీక్షలను మే 13 నుంచి 21వ తేదీ వరకు జరగనున్నాయి. ప్రధాన సబ్జెక్టులు మే 19వ తేదీతోనే ముగుస్తాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, సెకండ్ ఇయర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయి.ఇక ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు మే 22 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇంగ్లిష్ సబ్జెక్ట్ ప్రాక్టికల్ పరీక్షలను మే 26న నిర్వహిస్తారు. సాధారణంగా సప్లిమెంటరీ పరీక్షలకు సబ్జెక్టులు తప్పిన వారితోపాటు మెరుగైనా మార్కులు పొందేందుకు కూడా సబ్జెక్టులను

..మిగతా 4వ పేజీలో →



# శ్రీపాదరావుకు రేవంత్ నివాళి

**దశ, హైదరాబాద్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 27వ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ నివాసంలో వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెలుగు రాష్ట్రాల్లో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న

..మిగతా 4వ పేజీలో →

# అతిథి పక్షులకు స్వర్గధామం



**విదేశీ అతిథి పక్షులకు స్వర్గధామంగా మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి.**



**ప్రతి ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో వేలసంఖ్యలో సైబీరియన్ కొంగలు, ఇతర వలస పక్షులు.**

**ఒక్కో పక్షి మూడు నుంచి నాలుగు గుడ్లు పెట్టి, 30 నుంచి 45 రోజుల పాటు పొదుగు.**

**ప్రకృతి అందాలు, విదేశీ వలస పక్షుల సందడి కారణంగా పర్యాటక కేంద్రంగా మారే అవకాశాలు.**

**దశ, వరంగల్:** అనేక సంవత్సరాలుగా వేల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చే విదేశీ అతిథి పక్షులకు స్వర్గధామంగా మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి నిలుస్తోంది. ప్రకృతి అందాలతో నిండిన ఈ గ్రామంలోని చెరువులు, చెట్లు వలస పక్షులను అక్కున చేర్చుకుని, ఆశ్రయం ఇచ్చి.. పురుడుపోస్తున్నాయి.అతిథి పక్షులపై మమకారం.. మానవత్వం కురిపిస్తూ.. కరుణిస్తూ.. సంరక్షణ బాధ్యతలను చక్కగా నిర్వర్తిస్తూ.. ఈ ప్రాంతాన్ని విదేశీ పక్షుల పుట్టినిల్లుగా ఏళ్ల తరబడి నిలబెడుతున్న గ్రామస్తులు ఎంతో స్ఫూర్తినిస్తున్నారు. పక్షుల తల్లిప్రేమను, పిల్లల కేరింతలను, మురిపాలను చూసి సందర్శకులు ఆహ్లాదంతో మంత్రముగ్ధులవుతున్నారు. సైబీరియా వంటి చల్లని ప్రాంతాల నుంచి పక్షులు, ముఖ్యంగా కొంగలు (పెయింటర్ స్టోర్క్) మేచరాజుపల్లికి తరలివచ్చి, నివాసం ఏర్పరచుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రతి ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో వేలసంఖ్యలో సైబీరియన్ కొంగలు, ఇతర వలస పక్షులు చేరుకుంటాయి. చల్లని దేశాల్లో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో వేడి ప్రాంతాల కోసం ఈ పక్షులు వేల కిలోమీటర్ల దూరం ప్రయా ణించి ఇక్కడకు ప్రతి ఏటా క్రమం తప్పకుం డా వస్తాయి.డిసెంబర్ నుంచి జూలై వరకు గ్రామంలోని చెట్లపై గూళ్లు కట్టి గుడ్లు పెట్టి సంతానోత్ప త్తి చేసి, పిల్లలు పెద్దయ్యాక తిరిగి జూలై నెలలో పిల్లలతో కలిసి తమ స్వదేశాలకు వెళ్లిపోతాయి. వీటి ప్రధా న ఆహారం చెరువులోని చేపపిల్లలు. చేప పిల్లలను వేటాడి చెట్లపై నిలువ పెట్టుకోవడం మరో ప్రత్యేకతగా నిలుస్తోంది.మేచరాజుపల్లి చెరువు పరిసర ప్రాంతా ల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో పక్షుల కిలకిలారావాలు వినిపిస్తూ సందర్శకులను ఆకట్టుకుంటాయి. గుంపులుగా ఎగిరే పక్షు లు ఆకాశంలో అద్భుత దృశ్యాన్ని సృష్టిస్తా యి. ఈ కాలంలో చెట్లపై కనిపించే వందలాది విదేశీ అతిథి పక్షులను చూసేందుకు సమీప ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తుంటారు.గ్రామస్థులు ఈ పక్షులను తమ అతిథులుగా భావించి, సంరక్షణ చర్యలు చేపడుతు న్నారు. ప్రతి ఏడాదీ వచ్చే విదేశీ అతిథి పక్షు ల రాక కోసం నిరీక్షించడం, చెట్లను నరకకుండా కాపాడటం, పక్షులకు ఇబ్బంది కలి గించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇలా అతిథి పక్షులపై మమకారం.. మానవత్వం కురిపిస్తూ.. కరుణిస్తూ.. సంరక్షణ బాధ్యతలను తు.చ తప్పకుండా నిర్వర్తిస్తూ.. ఈ ప్రాంతాన్ని విదేశీ పక్షుల ఆవాసంగా ఏళ్ల తరబడి నిలబెట్టుతున్నారు. ఒక్కో పక్షి మూడు నుంచి నాలుగు గుడ్లు పెట్టి, 30 నుంచి 45 రోజుల పాటు పొదుగుతుంటాయి. జన్మించిన తమ పిల్లలకు ఇక్కడే ఎగరడం, మేత మేయడం, ఆహారాన్ని సంపాదించడం తదితర నైపుణ్యాలను తల్లి పక్షులు నేర్పిస్తుంటాయి. ఈ ప్రకృతి విన్యాసాలను, తల్లిప్రేమను, పిల్లపక్షుల



కేరింతల ను, మురిపాలను చూసి సందర్శకులు ఆహ్లాదంతో మంత్రముగ్ధులవుతుంటారు. ప్రకృతి అందాలు, విదేశీ వలస పక్షుల సందడి కారణంగా మేచరాజుపల్లి పర్యాటక కేంద్రంగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సరైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే పక్షి ప్రేమికులకు, ప్రకృతి సందర్శకులకు ఆకర్షణీయ ప్రాంతంగా అభివృద్ధి చెం దుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పక్షుల సంరక్షణకు చెరువు అభివృ ద్ధి, చెట్ల సంరక్షణ, పర్యాటక సదుపాయాల కల్పన వంటి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. పర్యావరణ పరిరక్షణ తో పాటు పర్యాటకాభివృద్ధి జరిగితే మేచరాజుపల్లి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందే అవకాశం ఉంది. వేల కిలోమీటర్ల ప్రయా ణం చేసి వచ్చే అతిథి పక్షులతో మేచరాజుపల్లి ప్రకృతి సోయగంగా మారుతూ నిజమై న పక్షుల స్వర్గధామంగా నిలుస్తోంది.

## ఫార్మా భూముల అవినీతిపై చర్చకు సవాల్

మొదటి పేజీ తరువాయి

బాగోతాన్ని ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచుతానని మంచిరెడ్డి కిషన్ రెడ్డి హెచ్చరించారు. ఈ బహిరంగ సవాల్ ఇప్పుడు నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. మరి శుక్రవారం నాటి చర్చకు కాంగ్రెస్ నేతలు స్పందిస్తారా లేదా అన్నది వేచి చూడాలి.

## శ్రీపాదరావుకు రేవంత్ నివాళి

మొదటి పేజీ తరువాయి

నాయకుడు శ్రీపాదరావు ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభ స్పీకర్ వరకు అనేక పదవులకు వన్నె తెచ్చిన నాయకుడని కొనియాడారు. శాసనసభ ఔన్నత్యాన్ని పెంపొందిస్తూ సభను ఎంతో హుందాగా నడిపిన తీరు శ్లాఘనీయమని అన్నారు. శ్రీపాదరావు జీవితం నేటి తరానికి ఒక గొప్ప స్ఫూర్తి అని ముఖ్యమంత్రి రు వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి , ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు.

## నేడు సీబీఎస్సీ పదో తరగతి పరీక్ష ఫలితాలు..

మొదటి పేజీ తరువాయి

సీబీఎస్సీ వెబ్‌సైట్‌లలో https://www.cbse.gov.in/ లేదా results.cbse.nic.in లేదా cbse.nic.in మాత్రమే చెక్ చేసుకోవల్సి ఉంటుంది. వీటితోపాటు తో పాటు డిజిలాకర్ (DigiLocker), ఉమాంగ్ (UMANG) యాప్‌ల ద్వారా కూడా తమ ఫలితాలను చెక్ చేసుకోవచ్చు. విద్యార్థులు తమ రోల్ నంబర్, స్కూల్ నంబర్, అడ్మిట్ కార్డ్ ఐడీ, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి ఫలితాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గత ఏడాది 10వ, 12వ తరగతి ఫలితాలు రెండూ ఒకేసారి మే 13న ప్రకటించారు. కాగా సీబీఎస్సీ పదో తరగతిలో ఈ ఏడాది నుంచి రెండో విడతలుగా బోర్డు పరీక్షలను నిర్వహిస్తుంది. ఈ విధానంలో విద్యార్థులు గరిష్టంగా మూడు సబ్జెక్టులలో తమ స్కోర్లను మెరుగుపరుచుకోవడానికి మళ్లీ పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తారు. సెషన్ 1 ఫలితాల్లో తమ మార్కులను మెరుగుపరుచుకోవాలనుకునే విద్యార్థుల కోసం బోర్డు సెషన్ 2 పరీక్షలను నిర్వహించనుంది. ఈ ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు మే 15 నుంచి ప్రారంభమవుతాయి. అలాగే పదో తరగతిలో ఒకటి లేదా రెండు మార్కులు తక్కువ వచ్చిన విద్యార్థులకు గ్రేస్ మార్కులు కూడా ఇవ్వనున్నారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించడానికి అభ్యర్థులు మొత్తం మీద కనీసం 33 శాతం మార్కులు పొందాల్సి ఉంటుంది.ఇక సీబీఎస్సీ 12వ తరగతి ఫలితాలు మే నెల రెండో వారంలో విడుదలయ్యే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. 10వ తరగతి పరీక్షలు మార్చి 11న ముగియగా, 12వ తరగతి పరీక్షలు 2026 ఏప్రిల్ 10న ముగిశాయి. పదో తరగతి, 12వ తరగతికి కలిపి ఈ ఏడాది దాదాపు 43 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరంతా ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్

మొదటి పేజీ తరువాయి

మళ్లీ రాస్తుంటారు. వీరికి రెండోసారి జరిగిన పరీక్షలో ఒక వేళ మార్కులు తగ్గితే పాత మార్కులే కొనసాగిస్తారు. దీంతో విద్యార్థులు మెరుగైన మార్కుల కోసం కూడా అధిక సంఖ్యలో పరీక్ష రాసేందుకు ముందుకొస్తున్నారు. ఈ పరీక్షలు రాసే విద్యార్థులకు విడిగా మళ్లీ హాల్ టికెట్లను జారీ చేస్తారు.

తెలంగాణ ఇంటర్ సప్లిమెంటరీ ఎగ్జామ్స్ 2026 టైం టేబుల్ ఇదే

మే 13న సెకండ్ లాంగ్వేజ్
మే 14న ఇంగ్లిష్
మే 15న మ్యాథ్స్ ఏ, బోటనీ , పొలిటికల్ సైన్స్
మే 16న మ్యాథ్స్ 2ఏ, జువాలజీ, హిస్టరీ
మే 18న ఫిజిక్స్, ఎకనామిక్స్
మే 19న కెమిస్ట్రీ, కామర్స్
మే 20న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ , బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్
మే 21న మోడ్రన్ లాంగ్వేజ్, జాగ్రఫీ




## వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలో ఘోర ప్రమాదం

**ఒకే కుటుంబంలో ముగ్గురి దుర్మరణం**

**భార్యాభర్తలు, కుమార్తె మృతి, కుమారుడు సేఫ్**

**దశ, వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలో సోమవారం ఉదయం పెను విషాదం చోటుచేసుకుంది. మండల పరిధిలోని సిద్దన్నమడుగు తాండ - తట్టేపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన దంపతులు తమ కుమారుడు, కుమార్తెతో కలిసి ద్విచక్ర వాహనంపై జహీరాబాద్ వెళ్తుండగా, గుర్తుతెలియని వాహనం వీరిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలతో పాటు కుమార్తె తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. కాగా, ఈ ప్రమాదం నుండి కుమారుడు గాయాలతో బయటపడటంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి పెద్దేముల్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్ చేరుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

## డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

మాదకద్రవ్యాలను మూత్ర పరీక్ష ద్వారా కేవలం నిమిషాల్లోనే గుర్తించవచ్చు. గాంధీ ఆసుపత్రి సైకియాట్రీ హెచ్‌వోడీ డాక్టర్ కె. అనుపమ తెలిపిన వివరాల ప్రకారం.. కిట్‌లో ఎరుపు గీత కనిపించకపోతే సదరు వ్యక్తి డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారిస్తారు. అయితే ఇవి కేవలం ప్రాథమిక పరీక్షలు మాత్రమే. అవసరమైతే మరిన్ని లోతైన క్లినికల్ పరీక్షలు నిర్వహిస్తారు. గత రెండు రోజుల్లో 90 మందికి పరీక్షలు చేయగా.. సుమారు 40 మందికి పాజిటివ్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.తీవ్రమైన వ్యసనానికి గురైన వారు లేదా మత్తు పదార్థాలు అందక శారీరకంగా ఇబ్బంది పడే వారి కోసం సబ్‌స్టెన్స్ ఇంటాక్సికేషన్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఇది ఐసీయూ తరహాలోనే పనిచేస్తుంది. డ్రగ్స్ మానేయడం వల్ల వచ్చే ఫిట్స్, స్పృహ కోల్పోవడం వంటి పరిస్థితుల్లో రోగులను ఇక్కడ చేర్చుకుని నిరంతర పర్యవేక్షణలో చికిత్స అందిస్తారు. పోలీసులు తీసుకొచ్చే నిందితుల విషయంలో ప్రభుత్వం పక్కాగా నిబంధనలు అమలు చేస్తోంది. నిందితులను పరీక్షల కోసం ఫారమ్ Aతో తీసుకొస్తారు. ఫలితాలను ఫారమ్ Bలో నమోదు చేస్తారు. నిందితుడు చికిత్సకు అంగీకరిస్తే ఫారమ్ C ద్వారా అడ్మిషన్ ప్రక్రియ చేపడతారు.చికిత్స తర్వాత రోగులను డ్రగ్ అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్స్‌కు పంపిస్తారు. ఇక్కడ ఆరు వారాల పాటు నిపుణుల పర్యవేక్షణలో కౌన్సెలింగ్, ఫ్యామిలీ థెరపీ, నార్కోటిక్స్ అనానిమస్ వంటి గ్రూప్ సెషన్లు నిర్వహిస్తారు. వ్యసనం అనేది ఒక వ్యాధి అని దానిని చికిత్స ద్వారా నయం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది యువత తిరిగి సాధారణ జీవితం గడిపే అవకాశం కలుగుతుందని అంటున్నారు.


## రంగారెడ్డి జిల్లాలో రైతుల ధర్నా

**గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆందోళన**

**దశ, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా హైదర్‌గూడలో “న్యాయం కోసం పోరాటం” పేరుతో మూసీనది వెంట భూములు కోల్పోతున్న రైతులు ధర్నా చేపట్టారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కారణంగా తమ భూములు కోల్పోతున్నామని ఆరోపిస్తూ మూసీ రివర్ బాధితులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు కింద మొత్తం 68 కుటుంబాలకు చెందిన 32ఎకరాల భూములు ప్రభావితమవుతున్నాయని రైతులు తెలిపారు.

## మలుపులు తిరుగుతున్న మంగ్లీ కేసు

మొదటి పేజీ తరువాయి



ఉదయం పీఎస్‌కు వచ్చిన తనకు బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయడం ఏంటని లాయర్ సుబ్బారావు పోలీసులను ప్రశ్నించారు. తనను అవమానించి, కేసు తప్పుదోవ పట్టించేందుకే పోలీసులు ఇలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తానేమైనా డ్రంక్ చేసి వాహనం నడిపానా ఏంటి.. కేవలం ఫిర్యాదు చేయడానికి కామన్ మ్యాన్‌లా పీఎస్‌కు వచ్చిన తనతో పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదన్నారు. తనపై మంగ్లీ చేసిన ఆరోపణలకు ఆధారం చూపించాలని డిమాండ్ చేశారు. తనపై నిరాధార ఆరోపణలను చేయడంతో ఎంతో మందిని మోసం చేసిన సింగర్ మంగ్లీపై కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పంజాగుట్ట పోలీసులను కోరారు. బాధితులు వచ్చి ఫిర్యాదు చేస్తారు, వారి గురించి మీరు హడావుడి చేయవద్దు అని సుబ్బారావుకు పంజాగుట్ట పోలీసులు సూచించారు. అయితే బాధితుల తరఫున తాను లీడ్ చేస్తున్నానని, లాయర్ గా వారికి అన్ని రకాలుగా చట్ట ప్రకారం సహాయం చేస్తానన్నారు. తప్పు చేసిన వారు ఎవరైనా చట్ట ప్రకారం శిక్ష తప్పదని, బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు.

### పాటే నా ప్రాణం.. నన్ను రోడ్డుకు లాగకండి..

మైక్రో ఫైనాన్స్ పేరుతో వందల కోట్ల రూపాయల వసూళ్లకు పాల్పడ్డారంటూ తనపై వస్తున్న ఆరోపణలపై ప్రముఖ టాలీవుడ్ సింగర్ మంగ్లీ తీవ్రంగా స్పందించారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ సదరు న్యాయవాదిపై ఆమె నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మీడియా ముందుకు వచ్చిన ఆమె తన ఆవేదనను వ్యక్తం చేస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. మార్చి 21న సుభా సియపోగు అనే వ్యక్తి తనను కలిశారని, లాయర్ సుబ్బారావు అనే వ్యక్తితో కలిసి తనను అమర్యాదగా బెదిరించారని మంగ్లీ ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు సంబంధం లేని కరెన్సీ నోట్ల వీడియోలు చూపించి, తనను కలవకపోతే పరువు తీస్తానని ఒత్తిడి తెచ్చారని వెల్లడించారు. ఈ పరిణామాలతో తన కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు. ‘నాకు ఎలాంటి వ్యాపారాలు లేవు.. కేవలం పాటే నా ప్రాణం. ఎవరో వచ్చి ఆరోపణలు చేస్తే నిజనిజాలు తెలుసుకోకుండా వార్తలు రాయవద్దు’ అని మంగ్లీ మీడియాను వేడుకున్నారు. కేవలం ఫేమస్ అవ్వాలనే ఉద్దేశంతోనే ఆ వ్యక్తి తనపై 150 కోట్ల మోసం అనే అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియా ద్వారా ఎదిగిన తనకు, అదే శాపంగా మారుతుందని ఎప్పుడూ అనుకోలేదని ఆవేదన చెందారు. గతంలో తనపై రాజకీయ ముద్రలు వేయడంతో తర్వాత ఏ పార్టీకి కూడా తాను పాటలు పాడలేదని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు.

## విజయశాంతిరెడ్డి ఆత్మహత్య కేసులో కొత్త ట్విస్ట్

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ శివారు చర్లపల్లిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ విజయశాంతి రెడ్డి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆస్తి కోసం తన అత్తమామలు, బామ్మర్ది పెట్టిన మానసిక క్షోభ తట్టుకోలేకే తన భార్య ఈ దారుణ నిర్ణయం తీసుకుందని భర్త సురేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు కొత్త మలుపు తిరిగింది. ఈ ఏడాది జనవరి 31న విజయశాంతి రెడ్డి (38), ఆమె కుమార్తె చైతన్య రెడ్డి (18), కుమారుడు విశాల్ రెడ్డి (17) చర్లపల్లిఘట్‌కేసర్ మధ్య గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.ఈ ఘటనపై తాజాగా మేడిపల్లి పోలీసులను ఆశ్రయించిన సురేందర్ రెడ్డి.. తన అత్త పుష్పలత, బామ్మర్ది చిరంజీవి, అతని భార్యపై తీవ్ర ఆరోపణలు చేశారు. "నా భార్య, పిల్లలు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాళ్లు కాదు. సొంతవాళ్లే నమ్మించి మోసం చేశారు. ఆస్తి కోసం తీవ్రంగా వేధించి, మానసికంగా కుంగదీసి వారి చావుకు కారణమయ్యారు" అని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారు చనిపోయిన 25 రోజులకే అత్త, బామ్మర్ది కలిసి తనను ఆస్తి కోసం బెదిరించడం మొదలుపెట్టారని సురేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.భార్యాపిల్లలు చనిపోయిన వెంటనే ఇంట్లో ఉన్న కేజీన్నర బంగారం, రూ.1.40 కోట్ల నగదును తన అత్త పుష్పలత గుట్టుచప్పుడు కాకుండా తీసుకెళ్లిందని ఆయన ఆరోపించారు. ఇప్పుడు తనను కూడా టార్గెట్ చేశారని, తనకు ప్రాణహాని ఉందని ఆయన వాపోయారు. తాను కూడా చనిపోతే ఆస్తి




మొత్తం వారికే దక్కుతుందనే దురుద్దేశంతో తనను అంతం చేయాలని చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ తనకు ఏమైనా జరిగితే ఆస్తి మొత్తం తన తల్లిదండ్రులకు లేదా ఏదైనా ట్రస్టుకు చెందేలా వీలునామా రాస్తానని, తన కుటుంబాన్ని నాశనం చేసిన వారికి ఒక్క పైసా కూడా దక్కనివ్వనని సురేందర్ రెడ్డి స్పష్టం చేశారు.హైటెక్ సిటీలో టీమ్ లీడర్‌గా పనిచేస్తున్న విజయశాంతి, దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్న సురేందర్ రెడ్డి దంపతులు బోడుప్పల్‌లో నివసించేవారు. జనవరి 30న హాస్టల్‌లో ఉన్న పిల్లలను ఇంటికి తీసుకొచ్చిన విజయశాంతి, అర్ధరాత్రి కారులో చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయింది. సురేందర్ రెడ్డి తాజా ఫిర్యాదుతో పోలీసులు ఆస్తి వివాదం కోణంలో ఈ కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు.